రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఫీవర్ సూపరింటెండెంట్ ప్రొ. డాక్టర్ రాజేంద్రప్రసాద్

- ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా. రాజేంద్రప్రసాద్
- 25 యూనిట్ల రక్తం సేకరణ

నల్లకుంట: వారంతా నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులే. కానీ సేవ చేయాలనే సంకల్పం ఉంది. తమ సంకల్పాన్ని ఆచరణలో పెట్టారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేసి అందరికీ స్ఫూర్తి నింపుతున్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రాజేంద్రప్రసాద్ అన్నారు. తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు వేడుకలను పురస్కరించుకొని ఉస్మానియా ఆస్పత్రి సహకారంతో సోమవారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడి, రక్తం కోల్పోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సకాలంలో రక్తం దొరకక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రక్తదానం చేయడం ద్వారా అలాంటి వారి ప్రాణాలు కాపాడిన వారవుతారని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ శిబిరం ద్వారా దాతల నుంచి 25 యూనిట్ల రక్తం సేకరించామని చెప్పారు. సేకరించిన రక్తాన్ని ఉస్మానియా బ్లడ్ బ్యాంక్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రక్త దాతలకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ శిబిరంలో ఆస్పత్రి సీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ ఎ.జయలక్ష్మి, డాక్టర్ సాయిసుధ, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయ శోభ తదితరులు పాల్గొన్నారు.


రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్

ధరణి మోసాలపై సమగ్ర విచారణ చేపట్టాలి



సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న మానవ హక్కుల వేదిక ఉమ్మడి రాష్ట్రాల కన్వీనర్ జీవన్ కుమార్, తెలంగాణ రైతు కూలీ పోరాట సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ధరణి ఒక మోసాల పుట్ట అని మానవ హక్కుల వేదిక ఉమ్మడి రాష్ట్రాల కన్వీనర్ ఎస్. జీవన్‌కుమార్ విమర్శించారు. ధరణి తప్పులు, మోసాలపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు – కూలి పోరాట సమితి ఆధ్వర్యంలో ''మోసాలపుట్ట ధరణి – డొల్లతనపు భూమాత''అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. సదస్సుకు ముందు సుందరయ్య పార్కు మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు.

- అనంతరం జరిగిన సభలో జీవన్‌కుమార్ మా ట్లాడుతూ... ధరణిని అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వ నాయకులు భూస్వాములు, పెత్తందారులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు పెద్ద ఎత్తున భూములు కాజేశారని విమర్శించారు. అయితే ధరణిలోని మోసాలపై విచారణకు రెవెన్యూ అధికారులను అప్పగించడం దొంగకు తాళం చెవి ఇచ్చినట్లే అయ్యిందన్నారు. క్షేత్ర స్థాయి గ్రామసభల ద్వారా విచారణ కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.

ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామన్నారు ఇప్పుడేమైంది?: విమలక్క

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల చైర్మన్ విమలక్క మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రెండు లక్షల రూపాయలు రైతులందరికి రుణమాఫీ చేస్తామని ప్రకటించిందన్నారు. సంవత్సర కాలం పూర్తి అయిందని అయితే మూడు విడుతలుగా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించి కేవలం 40శాతం మందికి మాత్రమే మాఫీ చేశారని అన్నారు. ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో పడేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరం అన్నారు. రైతులకు పంట రుణాల మాఫీ పూర్తిస్థాయిలో జరపాలని డిమాండ్ చేశారు.
- రైతు బరోసా పథకం ద్వారా రూ.15వేలు అందించాలని, కౌలు రైతులకు బరోసా అందించాలన్నారు. ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంతోపాటు సారవంతమైన తెలంగాణ భూములను రక్షించాలని కోరారు. రైతు కూలి పోరాట సమితి అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్త బాబూరావు, ఆచార్య కట్టాభగవంత్‌రెడ్డి, సామాజిక విశ్లేషకులు గొంతి నర్సింహారెడ్డి, వివిధ సంఘాల నాయకులు కన్నెగంటి రవి, అంబటి నాగయ్య, బొమ్మకంటి కొమురయ్య, వీరాంజనేయులు, బోయ సుంకన్న తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఇక విభేదాలకు స్వస్తి.!

సఖ్యతతో చర్చి కార్యక్రమాలు నిర్వహించాలని సొసైటీ, ట్రస్ట్ తీర్మానం


మాట్లాడుతున్న రాగి వీరాచారి

చిక్కడపల్లి: హెబ్రోను సొసైటీ, ట్రస్ట్ రెండు వర్గాల మధ్య కొన్నేళ్లుగా ఉన్న విభేదాలను పక్కకు పెట్టి సఖ్యతతో చర్చి కార్యక్రమాలు నిర్వహించాలని ఇరువర్గాల వారు తీర్మానించారని హెబ్రోను సొసైటీ అధికార ప్రతినిధి రాగి వీరాచారి అన్నారు. చిక్కడపల్లిలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అనధికార వ్యక్తులు నిర్వహించిన పత్రికా సమావేశంలో వివిధ చర్చిలకు చెందిన కొందరు నాయకులకు ఆర్థిక సమస్యలు ఉన్నట్లు ప్రస్తావించడం సరికాదన్నారు. హెబ్రోను చర్చికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రాలలో దాదాపు 20వేల చర్చిలు ఉన్నాయని వారెవరికి సంబంధం లేనట్టు కొందరు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇంతకు మునుపెన్నడు హెబ్రోను చర్చికి సంబంధం లేనివారు నిజానిజాలు తెలుసుకోకుండా మాట్లాడొద్దని కోరారు. ప్రతిఏడాది ఐటీ రిటర్న్స్ ఆడిట్ సక్రమంగానే జరుగుతున్నాయని తెలిపారు. హెబ్రోను చర్చిలో దైవ సేవకులైన ఎఫ్రాయింను గాయపరిచారని వచ్చిన వార్త అసత్యమన్నారు. నిజానికి ఆ వ్యక్తి పాస్టర్ కాదని అతడు డిఫెన్స్ కాలనీకి చెందిన వ్యక్తి అని అతడికి హెబ్రోను చర్చికి సంబంధం లేదని తెలిపారు. పోలీసులు కోర్టు ఉత్తర్వులను అమలయ్యేటట్టు చూడాలని ప్రభుత్వం కూడా ఈ విషయంలో చొరవ తీసుకుని న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో హెబ్రోను ట్రస్ట్ అధికార ప్రతినిధి ఎం.ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలని ఓయూ రిజస్ట్రార్‌కు వినతి

అంబర్‌పేట: బాగ్ అంబర్‌పేట డివిజన్ ప్రాంతాలకు సమీపంలో ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ ఆటవీ ప్రాంతం నుంచి ప్రజలకు తలెత్తుతున్న సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డి ఓయూ రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. సోమవారం ఆయన చాంబర్‌లో కలిసి తలెత్తుతున్న సమస్యలను ఆమె వివరించారు. మురుగనీరు, పెరిగిన చెట్ల కొమ్మలతో పాములు జనవాసాల్లోకి వస్తున్నాయని వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి.వెంకటరెడ్డి, స్థానిక బస్తీవాసులు ఉన్నారు.

'మేము మా యాత్రలు' సంపుటి ఆవిష్కరణ

చిక్కడపల్లి: రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం జిల్లా జీళ్ళ చెరువు నుంచి దేశంలోని వివిధ క్షేత్రాలు విశేషాలు షమీర్ జానకీదేవి తన 'మేము మా యాత్రలు'సంపుటిలో దర్శనీయం చేశారని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. సిల్వర్ ఓక్‌ధామంలో జరిగిన కార్యక్రమంలో వంశీ ఆర్ట్స్ థియేటర్స్ స్వర్ణోత్సవం సందర్భంగా సంపుటిని సోమవారం రాత్రి చిక్కడపల్లిలో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సంపుటిలోని వివిధ స్థలాలు సమాచారం కర దీపికగా యాత్రలు చేసే ప్రతి ఒక్కరికి ఉపయుక్తమని వివరించారు. తొలి ప్రతిని సాహిత్య అభిమాని చెంచలరావుకు అందజేశారు. రచయిత్రి జానకీదేవి, వనం సంజీవరావు, ఆకెళ్ల శేషకుమార్, ప్రచురణకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం.. సామాన్యుడి వజ్రాయుధం


ముచ్చర్ల మల్లేష్‌కు నియమక పత్రం అందజేస్తున్న డాక్టర్ చంటి ముదిరాజ్

కాచిగూడ: సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ అన్నారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా ముచ్చర్ల మల్లేష్‌ను నియమిస్తూ నియామకపు పత్రాన్ని సోమవారం చంటి ముదిరాజ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం–2005ను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఆర్టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు ఇవ్వాలని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగినప్పుడు ప్రాణహాని ఉన్నప్పుడు కేవలం 48 గంటలలో సమాచారం అధికారులు ఇవ్వాలన్నారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రజా ప్రయోజనాల నిమిత్తం సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన సమాచారం మేరకే ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లం వెంకటేశం, గుండెల రాయుడు, బత్తుల మహేష్ గౌడ్, జి.ప్రియారెడ్డి, ఎర్రబెల్లి ప్రగతి, వింజమూరి గణేష్, అంతటి అజయ్ కుమార్, రాసునూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫీవర్‌లో పండ్ల పంపిణీ

నల్లకుంట: అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9గంటలకు స్థానిక ఫీవర్ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ, కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే నర్సింహబస్తీలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి


నింబోలిఅడ్డలో పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలో జనాభాకు అనుగుణంగా తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ పనులను ఆధునీకరిస్తున్నామని.. అదే విధంగా సీవరేజీ సమస్య పరిష్కారానికి శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. నింబోలిఅడ్డలో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న తాగునీటి పైపులైన్ పనులను సోమవారం ఆయన స్థానిక కార్పొరేటర్ ఉమాతో కలిసి ప్రారంభించారు. నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం కృష్ణ, ఏఈ భావన, నాయకులు వెంకటేష్‌యాదవ్, కన్నె రమేష్‌యాదవ్, సుభాష్ పటేల్, బల్వీర్, హజారిబాబు, ఓం ప్రకాష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ



చిక్కడపల్లి: డివిజన్‌లోని సబర్మతినగర్‌లో రవీందర్ గురుస్వామి ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్పస్వా మి మహా పడిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఉమేష్, కుమార్, వెంకటేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం

ముషీరాబాద్: బాకారం బస్తీలో 6వ బొడ్రాయి వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బస్తీలోని మహిళలందరూ బొడ్రాయికి బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. బాకారం బస్తీ ధర్మాచరణ సమితి అధ్యక్షులు పాశం అనిల్ కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.


బొడ్రాయి వార్షికోత్సవ కార్యక్రమంలో పాశం అనిల్‌కుమార్‌యాదవ్

పద్మశాలి కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించండి


డా.చిక్కా దేవదాస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పద్మశాలి కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించాలని చేనేతవర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంతేకాకుండా పద్మశాలి కార్పొరేషన్‌కు పూర్తిస్థాయిలో పాలకవర్గాన్ని నియమించి 2500 కోట్లు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వం చేయలేని చేనేతకు రూ.30కోట్ల రుణమాఫీతో పాటు రూ.290కోట్ల బకాయిలు ఈ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కళాశాలను స్థాపించి ఆ కళాశాలకు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టడం ముఖ్యమంత్రికి చేనేతపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నట్లు అయిందన్నారు. కాంగ్రెస్ పాలనలో చేనేతకు పూర్వ వైభవం సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సన్మానం



చిక్కడపల్లి: యువజన కాంగ్రెస్ తెలంగాణ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనా ఎం.అరవింద్‌కు మార్‌యదవ్‌ను సోమవారం టీజేఎస్ నియోజవర్గ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్ కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎన్.శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని కూలీ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని కూలీ మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... పాతబస్తీ వట్టెపల్లికి చెందిన కూలీ సంజయ్ మోహన్ (51) ఫలక్‌నుమా–బుద్వేల్ రైల్వేస్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

357 గజాలకు ఐదు అంతస్తుల అనుమతులా.?

ఫిర్యాదులు చేసినా పట్టించుకోని సంబంధిత అధికారులు


రాంనగర్ డివిజన్ అచ్చయ్యనగర్‌లో ఐదో అంతస్తులో కొనసాగుతున్న నిర్మాణ పనులు


అక్రమంగా ఐదు ఫ్లోర్ల నిర్మాణం జరుపుతున్న దృశ్యం

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ అచ్చయ్యనగర్‌లోని ఓ ఇంటి యజమాని తన 357 గజాల స్థలంలో బహిరంగంగా ఐదంస్తులను నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని నిర్మాణం జరుగుతున్న ఇంటి పక్క స్థానికుడు, భూదాన్ రాంచంద్రారెడ్డి కుమారుడు వి.చంద్రారెడ్డి ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ... పక్కనే ఉన్న తాను 720 గజాల స్థలంలో ఇళ్లు నిర్మించిన తాను 11 ఫీట్లు సెట్‌బ్యాక్ వదిలానని ఆయన వితల్ మాత్రం 357 గజాల స్థలంలో భవన నిర్మాణం చేపట్టి కేవలం మూడు ఫీట్లు మాత్రమే సెట్‌బ్యాక్ వదిలారని తెలిపారు. దీనికి తోడు రెండు వైపుల రోడ్డు ఉన్నప్పటికీ, నిత్యం ట్రాఫిక్‌తో ఉన్న రోడ్లకు మూడు ఫీట్లు సెట్ బ్యాక్ వదలడం వల్ల భవిష్యత్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దీనిపై నవంబర్ 28వ తేదీన జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు, సిటీ చీఫ్ ప్లానర్ గంగాధర్‌కు ఫిర్యాదు చేశానని, చీఫ్ సిటీ ప్లానర్ వెంటనే జీహెచ్‌ఎంసీ సర్కిల్–15 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్‌కు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. గురువారం మళ్లీ టౌన్ ప్లానింగ్ ఏసీపీని కలిసినప్పటికి ఆయన ఏమాత్రం పట్టించుకోకపోగా పనులు మాత్రం ఐదో ఫ్లోర్‌లో యథావిధిగా జరుగుతున్నాయని తెలిపారు. జీహెచ్‌ఎంసీ నిబంధనలను అతిక్రమించి నిర్మాణం చేపడుతున్న ఈ భవనంపై వెంటనే చర్యలు తీసుకోవాలని అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కవాడిగూడ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొడ్డు మనోహర్



కవాడిగూడ: డివిజన్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా బొడ్డు మనోహర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... తనను ఓటు వేసి గెలిపించిన యువజన కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కవాడిగూడ డివిజన్‌లో ఇంటింటికీ తీసుకెళ్తానన్నారు. అదే విధంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

అలరించిన ద్రౌపది స్వయంవరం హరికథ గానం

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో హరికథ పితామహుడు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాస, నేతి లక్ష్మీనారాయణ భాగవతుల జయంతి హరికథ మహోత్సవాలు నేత్ర పర్వంగా కొనసాగుతున్నాయి. మహోత్సవాల్లో రెండో రోజైన సోమవారం సాయంత్రం ఎస్. చిరంజీవా చార్యులు 'ద్రౌపది స్వయంవరం'పై హరికథ గానం ఆహూతులను ఆకట్టుకుంది. దీనికి వయోలిన్‌పై దక్షిణామూర్తి, బి. శ్రీపతిరావు, మృదంగంపై సుధాకర్ వాద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ కన్వీనర్ యనమండ్ర వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ.. దివంగత నారాయణదాసు ఒకసారి కలకత్తాలో 'శ్రీకృష్ణ జననం'పై సంస్కృత గానం చేయడం విని మంత్రముగ్ధుడైన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాకూర్ ప్రశంసించడం గొప్ప విషయమన్నారు.


'ద్రౌపది స్వయంవరం'పై హరికథ గానం చేస్తున్న ఎస్.చిరంజీవా చార్యులు

నేడు 'భక్త అంబరీష'పై హరికథ గానం..

సోమవారం సాయంత్రం సప్పా భారతి భాగవతారిణిచే 'భక్త అంబరీష'పై హరికథ గానం ఉంటుందని ప్రోగ్రామ్ కన్వీనర్ యనమండ్ర వెంకటకృష్ణయ్య తెలిపారు.

'అష్టావధానం మేధాశక్తిని పెంపొందిస్తుంది'


అష్టావధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్‌ను సత్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భాషతో చేసే ప్రయోగమే అష్టావధానం అని ఈ అష్టావధానం మేధాశక్తిని పెంపొందిస్తుందని పూర్వ ప్రభుత్వ సలహాదారులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి రమణాచారి అన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని న్యూఎరా జూనియర్ కాలేజ్, సెంట్ ఆడమ్స్ హైస్కూల్, అవధాన విద్యా వికాస పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఐఐటీ కరఘ్‌పూర్ బీటెక్ విద్యార్థి అవధాన కళాకౌముది నల్లాన్ చక్రవర్తుల సాహిత్ చే అష్టావధానం ఆకట్టుకునేలా సాగింది. న్యూఎరా జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ... భాషా, వ్యాకరణం, చందస్సు, గణితంపైన పట్టుఉన్నప్పుడే అవధాన ప్రక్రియలో రాణిస్తారని అన్నారు. ఈ ప్రక్రియకు ఏకాగ్రత ఎంతో ముఖ్యమైంది అన్నారు. తెలుగు భాషలో అత్యంత ప్రాచుర్యం పొందిన గొప్పకళ అవధానం అని ప్రపంచ వ్యాప్తంగా ఈ అవధానానికి ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నారని చెప్పారు. అనంతరం అష్టావధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అవధాన ప్రాచార్య డాక్టర్ ధూళిపాక మహదేవమణి, అవధాన విద్యావికాస్ పరిషత్ అధ్యక్షులు మరుమాముల దత్తాత్రేయ శర్మ, సాధన సాహితి శ్రవంతి అధ్యక్షులు నర్సింహచార్య, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, డాక్టర్ అష్టకాల విద్యామనోహర్ శర్మ, అన్నమరాజు ప్రభాకర్‌రావు, పీఎల్ నాగేశ్వర్‌రావు, మంకాల లక్ష్మీమానస, కేవీఎస్ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- ఓయూ లా ప్రొఫెసర్ విజయలక్ష్మి
- అంబేడ్కర్ లా కళాశాల స్నాతకోత్సవం


విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న ప్రొ. విజయలక్ష్మి


అంబేడ్కర్ లా కళాశాల స్నాతకోత్సవంలో ప్రొ. విజయలక్ష్మి, మంగరి రాజేందర్ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: న్యాయవిద్యార్థులు సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల డీన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కళాశాల స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... న్యాయ విద్యార్థులు న్యాయచట్టాలు, న్యాయ శాస్త్రాలపైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఏ రంగాన్ని ఎంచుకుంటామో ఆ రంగంలో ప్రావిణ్యతను సాధిస్తే మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా న్యాయవిద్యకు, న్యాయవాదులకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. చట్టాన్ని కాపాడడంలో న్యాయకోవిధులు చేస్తున్న కృషిని మరవలేమని అన్నారు. అనంతరం లా పూర్తి చేసిన ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయ అకాడమీ పూర్వ డైరెక్టర్ మంగరి రాజేందర్, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణుప్రియా, ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, పీవీ రమణకుమార్, ప్రభుత్వ కౌన్సిల్ సభ్యులు ప్రియా తదితరులు పాల్గొని ప్రసంగించారు.

బోర్లకుంట దీపక్‌కుమార్‌కు అంతర్జాతీయ గ్లోబల్ పీస్ అవార్డు



అంబర్‌పేట: పురస్కారాలు ప్రోత్సాహాన్ని, బాధ్యతలను పెంచుతాయని నేతకాని మహర్ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి, సామాజిక వేత్త బోర్లకుంట దీపక్‌కుమార్ అన్నారు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ మానవ హక్కుల సదస్సులో అంతర్జాతీయ గ్లోబల్ పీస్ అవార్డును అసిస్టెంట్ మినిస్టర్ ఆఫ్ ఫారిన్ ఎఫైర్స్(యూఎస్ఏ), ఐక్యరాజ్య సమితి సభ్యుడు ప్రొ. సీహెచ్ మధుకృష్ణన్ చేతుల మీదుగా అందుకున్నట్లు సోమవారం దీపక్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రెండు దశాబ్దాలుగా బడుగు, బలహీన వర్గాల హక్కుల రక్షణ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఆయన అన్నారు. ఇలాంటి అవార్డులు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఆకాశవాణిలో లలిత గీతాలకు విశిష్టత



చిక్కడపల్లి: మోహన్ మెలోడీస్ ఆధ్వర్యంలో లలిత సంగీత విద్వన్మణి పాలగుమ్మి విశ్వనాథం జయంతిని సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించారు. సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నతాధికారి డాక్టర్ కేవీ.రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాలగుమ్మి విశ్వనాథం ఆకాశవాణిలో లలిత గీతాలకు ఎంతో విశిష్టతను కల్పించారని కొనియాడారు. ఈ సందర్భంగా లలిత సంగీత గాయకులు మల్లాది సూరిబాబు, రామలక్ష్మి రంగాచార్యులకు పాలగుమ్మి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం అధ్యక్షత వహించిన కార్యక్రమంలో కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుత చండీహోమం

1008 హోమకుండములు.. పాల్గొన్న 10,008 భక్తులు



కవాడిగూడ: కామాఖ్యామృత శోధన సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి, సౌభాగ్యం కోసం ఎన్‌టీఆర్ స్టేడియంలో 1008 హోమకుండములలో ఆయుత చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 10,008మంది హోమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమృతానంద నాద సరస్వతి ఆశీస్సులతో వారి శిష్యురాలైన వేణుశ్యామ నిర్వహణలో ఆయుత చండీహోమం నిర్వహించారు. ఈ హోమం అనంతరం లోక కల్యాణం కోసం ఆయుత చండీహోమం ఫలితాన్ని భూమికి ధారబోసినట్లు హోమ నిర్వాహకులు తెలిపారు.